క్లుప్తంగా

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న వైద్య బృందం

జగిత్యాల: లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని మాత శిశు సంరక్షణాధికారి జైపాల్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి స్కానింగ్ మిషన్లను, నంబర్లను సరిచూశారు. ప్రతి ఒక్కరు ఫారం ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. గైనకాలజిస్టులు సిజేరియన్ సెక్షన్ ఆడిట్ ఫాంలను ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకులు భూమేశ్వర్, శంకర్, ఆరోగ్య విస్తరణాధికారి రాజేశం, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: ప్రజలకు వైద్యసేవలందించడంలో ల్యాబ్ టెక్నిషియన్లది కీలకపాత్ర అని డీఎంహెచ్‌వో ప్రమోద్ అన్నారు. శనివారం ల్యాబ్ టెక్నిషియన్లు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మహ్మద్ సలీం, సత్యనారాయణ, శ్రీధర్, రాజేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపికైన విద్యార్థులు వర్షిత, వాగ్దేవి, మణిదీప్, ఉపాధ్యాయులు అభయ్‌రాజ్‌లను అభినందించారు. దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనల్లో సైతం అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మెట్‌పల్లి హెచ్‌ఎం కనకదార, సిస్టర్ జ్యోతిస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్సై

బుగ్గారం(ధర్మపురి): సీసీ కెమెరాల ఏర్పాట అభినందనీయమని బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని గోపులాపూర్‌లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని ప్రతీ ఆలయం, చర్చి, మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బలుమూరి రామారావు, కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అమీర్, శంకరయ్య, మదన్, సనత్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం పరిశీలన


పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో


బుగ్గారం(ధర్మపురి): పిల్లల్లో రోగనిరోధక వ్యవస్థ పెంపొందించడానికి టీకాలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలో ఆక్సాయిపల్లెలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు అందించే టీకాల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సతీష్, వెంకటేష్, రాణి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత సామాజిక స్పృహను అలవర్చుకోవాలి

మల్లాపూర్: యువత క్రీడలతో పాటు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని వీడీసీ చైర్మన్ ఎండీ.మహబుబ్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని మొగిలిపేటలో క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. టోర్నీ విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోరాటం ఫలించేనా..?

- బండలింగాపూర్‌ను మండలం చేయాలని డిమాండ్
- దీక్షలతో పోరుబాట పట్టిన గ్రామస్తులు
- బీఆర్‌ఎస్ హయాంలో మండలంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్
- పలు కారణాలతో ఏర్పాటుకు బ్రేక్
- తాజాగా తెరపైకి మండలం ఏర్పాటు అంశం


బండలింగాపూర్ గ్రామం


ఇటీవల అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామాన్ని మండలంగా చేయాలనే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. బండలింగాపూర్‌ను మండలంగా ప్రకటిస్తూ గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై అభ్యంతరాలు, వినతులు స్వీకరించారు. ఈ ప్రక్రియ పూర్తయినా ఆ సమయంలో ఎన్నికలు రావడంతో రాజకీయ కారణాల వల్ల గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిన్నుకుండిపోయింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో, ఈ పరిస్థితుల్లో బండలింగాపూర్ మండలం ఏర్పాటు అవుతుందా లేదా అన్నది ఆసక్తిగా మారింది. జిల్లాలోని రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో తమ గ్రామాన్ని కూడా కొత్త మండలంగా చేయాలని బండలింగాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై కార్యాచరణ రూపొందించుకున్న గ్రామస్తులు అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులను కలుస్తూ విన్నవిస్తున్నారు.

వంద రోజులకు పైగా దీక్షలు

ఇబ్రహీంపట్నం మండలంలో మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగిన బండలింగాపూర్‌ను 2016లో జిల్లాల పునర్విభజన, మండలాల ఏర్పాటు సమయంలో మెట్‌పల్లి మండలంలో చేర్చారు. తర్వాత మెట్‌పల్లి మండలంలో మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగింది. ఈ క్రమంలో పరిపాలన సౌలభ్యం, తదితర విషయాల్లో ఇబ్బందులు ఎదురుకావడంతో గ్రామస్తులు బండలింగాపూర్‌ను మండలంగా చేయాలని పోరుబాట పట్టారు. అప్పట్లో 100 రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలకు ఏడెనిమిది గ్రామాల ప్రజలు సంఘీభావం ప్రకటించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీల పాలకవర్గాలు సైతం అనుకూలంగా తీర్మానాలు చేశాయి. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వం బండలింగాపూర్ మండల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

వినతులు సమర్పణ

బండలింగాపూర్‌ను మండలంగా చేయాలని వీడీసీ, గ్రామస్తులు మరోమారు పోరుబాటకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే కార్యాచరణతో ఉన్న గ్రామస్తులు రెండురోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ లత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ను కలిశారు. తమ గ్రామాన్ని మండలంగా ఏ ర్పాటు చేయాలని వినతులు సమర్పించారు. ప్రభుత్వ పెద్దలను సైతం కలవనున్నట్లు పే ర్కొంటున్నారు. లేకుంటే గతంలో మాదిరి గానే ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

పది రెవెన్యూ గ్రామాలతో..

మేజర్ గ్రామ పంచాయతీ బండలింగాపూర్‌ను పది రెవెన్యూ గ్రామాలతో నూతన మండలంగా ఏర్పాటు చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జూన్ 26, 2023లో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో బండలింగాపూర్‌తో పాటు రాజేశ్వర్‌రావుపేట, మేడిపల్లి(ప), రాంచంద్రంపేట, విట్టంపేట,మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, రంగారావుపేట, ఆత్మకూర్ గ్రామాలను చేర్చారు. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలో సత్తక్కపల్లి, చెర్లకొండాపూర్, ఆత్మనగర్, పాటిమీదితండా, ఏఎస్ఆర్ తండా, కేసీఆర్ తండాలు ఉన్నాయి. వీటిపై అభ్యంతరాలు, వినతులు స్వీకరించారు. సత్తక్కపల్లి, మేడిపల్లి, జగ్గాసాగర్ గ్రామాలను మెట్‌పల్లి నుంచి విభజించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో మార్పులు, చేర్పులు చేసి తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పినా మళ్లీ అటువైపు అడుగులు పడలేదు.

మా కల నెరవేర్చాలి



బండలింగాపూర్ గ్రామాన్ని మండలంగా చేయాలి. గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఇప్పటికీ మండలం ఏర్పాటు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మా గ్రామస్తుల కల నెరవేర్చాలి. మండలం ఏర్పాటు కోసం ఉద్యమం చేయాలని కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– చెప్యాల రాజం, వీడీసీ అధ్యక్షుడు, బండలింగాపూర్



సారంగాపూర్: పంట పొలాలకు సాగునీరందించే ఎస్సారెస్పీ కాలువలు పలు చోట్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతిని పోవడంతో కాలువ చివరి భూములకు సాగునీరందడం కష్టతరంగా మారింది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాలకు సాగునీరు అందించే 13 ఆర్ కాలువ సిమెంట్ లైనింగ్ చాలా చోట్ల శిథిలమైపోయింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే కాలువల పరిస్థితి ఈ విధంగానే ఉంది. ప్రభుత్వం కాల్వల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చక్రునాయక్ డీఈ, ఎస్సారెస్పీ, సెల్ నంబర్: 9652638815

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పసుపు రైతుల సంబరాలు


చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో ఇబ్రహీంపట్నంలో పసుపు రైతులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం పసుపు పంట వద్ద రైతులు ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎంపీ నిలబెట్టుకున్నారని, పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో పసుపు రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ప్రధాని, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి, చెరుకు రైతుల సంఘం ఉపాధ్యక్షుడు ఎలిసే పాపన్న, రైతులు నర్సారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలించిన ఆర్డీవో


మల్యాలలో సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

మల్యాల: మండల కేంద్రంలో చేపట్టిన ఇంటింటి రేషన్ కార్డు సర్వేను శనివారం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. అర్హులను ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో 1284 మంది ఇళ్లలో కార్యదర్శులు సర్వే చేపడుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ రాణి, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెగడపల్లి: రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలపై జరుగుతున్న సర్వేను శనివారం పెగడపల్లిలో అధికారులు పర్యవేక్షించారు. అధికారులు దరఖాస్తులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 9077 ఇందిరమ్మ ఇళ్ల కోసం, 925 రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని సర్వే చేయడం జరుగుతుందని ఈ నెల 21 గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సాగు చేయని భూములను గుర్తించి తొలగించాలని తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ సర్వే సిబ్బందికి సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలో చేపడుతున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ పథకంపై చేస్తున్న సర్వే పనులను పరిశీలించి మాట్లాడారు. సాగు చేస్తున్న అర్హులైన రైతులను గుర్తించాలని, తప్పుగా నమోదు చేయవద్దని తెలిపారు. ఆరోపణలు రాకుండా సర్వే పనులను చేపట్టాలని సిబ్బందికి కోరారు. కార్యక్రమంలో ఎఈవో రవళిక, కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించాలని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో శశికుమార్ రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వారు పర్యటించి సంబంధిత అధికారులు చేస్తున్న రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వే సూపర్ చెక్‌ల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీవో జగదీష్, ఎవో లావణ్య, ఆర్ఐలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలపై అవగాహన

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని స్థానిక పోస్టాఫీస్ కార్యాలయంలో శనివారం పోస్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సుకన్య సమృద్ధి, తపాలాబీమా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, పోస్టాఫీస్ అందించే సేవల గురించి వివరించారు. రైతులకు సేవింగ్ అకౌంట్స్, డిపాజిట్ అకౌంట్స్, ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ మెయిల్ ఓవర్ రాచమల్లి శ్రీకాంత్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వేణు మాధవ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: బల్దియాలో ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పట్టణ ప్రజలను కోరారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద 2020లో రూ.వెయ్యి ఫీజు చెల్లించిన వారి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు సమర్పించి మిగతా ఫీజు చెల్లించాలని కోరారు. మార్చి 31తో ముగియనున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగిత్యాలలో టాస్క్ క్యాంపస్ డ్రైవ్

జగిత్యాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగ కల్పన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ నాలెడ్జ్ సంస్థ జగిత్యాలలోని నలంద డిగ్రీ కళాశాలలో ఈనెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌లో ప్రముఖ ఇండియన్ లోకల్ సెర్చ్ ఇంజన్ కంపెనీ జస్ట్ డయల్ వారు 100 ఉద్యోగాలు ఇవ్వడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 2024లో డిగ్రీ పూర్తి చేసిన, ప్రస్తుతం చేసుకోబోతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రిలేషన్‌షిప్ మేనేజర్ గంగప్రసాద్ పాల్గొన్నారు.

సాగు యోగ్యం కాని భూములు 658.1 ఎకరాలు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతు భరోసా కోసం నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటివరకు 658.1 ఎకరాలు సాగు యోగ్యంగా లేనట్లు గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్ తెలిపారు. ఈనెల 15 నుంచి 20 వరకు గ్రామస్థాయిలో సర్వే కొనసాగుతుందని, నాలుగు రోజుల్లోనే 197 గ్రామాల్లో సర్వే నిర్వహించామని, 658.1 ఎకరాలు సాగు యోగ్యంగా లేవని గుర్తించామని వివరించారు.

వయోవృద్ధులను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల: వయోవృద్ధులను విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఏవో తఫజ్జుల్ హుస్సేన్ అన్నారు. తమ కొడుకులు పట్టించుకోవడం లేదని పలువురు ఫిర్యాదు చేయగా శనివారం విచారణ చేపట్టారు. జేరిపోతుల అంజయ్య, లచ్చయ్య, భూమమ్మ, లచ్చవ్వ అనే వ్యక్తులు తమ కుమారులు, కోడళ్లు, కూతుళ్లు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయగా, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా తల్లిదండ్రులను పట్టించుకోకపోతే సంరక్షణ చట్టం ప్రకారం చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఎఫ్ఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెగడపల్లి: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండలంలోని దోమలకుంట రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజా కూరగాయలు, పండ్లు, పిండి పదార్థాలు, మొక్కల ఆధారిత ఆహారాలను తీసుకోవాలని చిన్నారుల తల్లులకు సూచించారు. అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మమత, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో గౌడ సంఘం కల్యాణమండపం అదనపు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఈ

జగిత్యాలరూరల్: రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రావు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

లే ఔట్ లేకుండా ప్లాట్లు విక్రయిస్తే చర్యలు

మెట్‌పల్లి: లేఔట్ లేకుండా ప్లాట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని టీపీవో రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని 1, 4 వార్డుల్లో లే ఔట్ లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో హద్దు రాళ్లను తొలగించారు. అలాగే 20 వార్డులో సెట్ బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఓ ఇంటి పిల్లర్‌ను కూడా తొలగించారు.

నామాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌లో పద్మపాణి సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారి నరేశ్ పాల్గొని 50 మంది వరకు వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలు సేకరించాని మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, సంధ్య, చంద్రకళ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత

జగిత్యాలక్రైం/మేడిపల్లి: మేడిపల్లి మండలం రంగాపూర్ శివారు మామిడితోటలో పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీసీఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.13,820 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను మేడిపల్లి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఎన్నడో వేసిన రోడ్లు తప్పా నూతనంగా రోడ్లు వేయలేదని, ప్రస్తుతం అన్ని వార్డుల్లో రోడ్లు వేయిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో వార్డుకు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించి నట్లు, లేఅవుట్ ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. అమృత్ పథకం కింద ఇంటింటికీ మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఆసియా సుల్తానా, ఫిర్దోస్ బేగం పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

కోరుట్ల: పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం రూ.1.50 లక్షల ఎల్వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన ఎస్ లక్ష్మి అనారోగ్యంతో బాధడుతుండటంతో వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేసిన ఎల్వోసీని అందించారు. కార్యక్రమంలో సుద్దు అమృత, నల్ల బాపురెడ్డి, నల్ల శ్రీనివాస్, నేమూరి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ విద్యార్థులకు చేయూతనందించాలి

జగిత్యాల: పద్మశాలీ విద్యార్థులకు చేయూతనందించాలని మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరి నరహరి అన్నారు. శనివారం జిల్లా పోపా నాయకులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పద్మశాలీలందరూ ఐక్యతగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జగిత్యాలలో పోపా నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పోపా అధ్యక్షుడు కొక్కుల రాజేశ్, గౌరవ అధ్యక్షుడు ఏవీఎస్.రాజు, ఆర్థిక కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర నాయకులు బోగ వెంకటేశ్వర్లు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత

కోరుట్ల: కథలాపూర్ మండలం దుంపేట గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్, గంబీర్‌పూర్ కు చెందిన అర్మెల్ల మహేశ్ గత డిసెంబర్‌లో కోరుట్ల పట్టణంలో సెల్ ఫోన్ పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లు రికవరీ చేసి ఎస్సై శ్రీకాంత్ శనివారం వారికి అందజేశారు.

ఆలయానికి వెండి సామగ్రి వితరణ

కోరుట్లరూరల్: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప. జ్ఞాన సరస్వతి ఆలయానికి అల్లె శ్రీనివాస్-లలిత దంపతులు రూ. 65 వేల విలువ గల వెండి సామగ్రిని శనివారం అందజేశారు. పట్టణానికి చెందిన మాన్పూరి రాజశేఖర్-అనూష, శైలేందర్-శ్రావ్య దంపతులు రూ.21 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో భయపెట్టలేరు

జగిత్యాల: సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పోస్టులు పెడితే అక్రమ కేసులు పెడుతున్నారని యూత్ నాయకులు గంగారెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, కల్యాణ లక్ష్మి కింద వచ్చే చెక్కు, తులం బంగారం ఎది అని పోస్టు పెడితే పోలీసులు అర్ధరాత్రి ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు హరీశ్, ప్రతాప్, మహేశ్, చందు, రంజిత్ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెట్‌పల్లి: గోధూర్, కోరుట్ల, కథలాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను మాత్రమే సరఫరా చేయనున్నట్లు డీఈ గంగారాం తెలిపారు. రెండు మున్సిపాలిటీల్లో యథావిధిగా త్రీ ఫేజ్‌ను సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

మెట్‌పల్లిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21 న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి,ఏపీవో తెలిపారు.

గ్రామసభలు

సారంగాపూర్: ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 21 నుంచి బీర్‌పూర్ మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు బీర్‌పూర్ ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. 21న చెర్లపల్లి, తుంగూర్, చిత్రవేణిగూడెం, 22న కండ్లపల్లి, రేకులపల్లి, తాళ్ల ధర్మారం, బీర్‌పూర్, నర్సింహులపల్లె, 23న కమ్మునూర్, కొల్వాయి, మంగేళ, కందెనకుంట,24న రంగసాగర్, కోమన్‌పల్లి, చిన్న కొల్వాయి గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల ఉపాధికి పునరావాస పథకం

- జిల్లా సంక్షేమాధికారి నరేశ్



జగిత్యాల: దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి పునరావాస పథకం ప్రవేశపెట్టిందని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. ఈ పథకం కింద బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేల సబ్సిడీ, బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.లక్ష యూనిట్‌కు రూ.80 వేల సబ్సిడీ, రూ.2 లక్షల యూనిట్‌కు రూ.1.40 లక్షల సబ్సిడీ, రూ.3 లక్షల యూనిట్‌కు రూ.1.80 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాకు 26 యూనిట్లు మంజూరయ్యాయని, లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్‌లో జరుగుతుందనిపేర్కొన్నారు. www.tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 8 వరకు అన్ని ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా: 9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: మనోజ్ - 8074811004
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899